సాక్షి తిరుపతి

సోమవారం । 12 । ఆగస్టు । 2024



రాజ్యాంగ నిర్మాతకు అవమానం

అంబేడ్కర్‌ను టీడీపీ నేతలు అవమానించారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ మండిపడ్డారు. - 8లో



'పచ్చ' గద్దలపై తిరుగుబాటు

కాలువను కబ్జా చేస్తున్న టీడీపీ నేతలపై తిరుపతి రూరల్ మండలం పేరూరు వాసులు తిరగబడ్డారు. - 8లో



డీఎస్సీ శిక్షణ.. డోలాయమానం!

డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత శిక్షణ కోసం ఎదురుచూస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వర్సిటీలో సందేహాల నివృత్తి కేంద్రాలు



ముఖ్యఅతిథులతో వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : పలు శాస్త్రాలు, పురాణాల విషయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేసేందుకు జాతీయ సంస్కృత వర్సిటీలో ప్రత్యేక కేంద్రాలను (పబ్లిక్ కన్సల్టెన్సీ సెంటర్స్) ఏర్పాటు చేశామని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ అహల్యతో కలసి ఆదివారం వర్సిటీ ఆవరణలో సందేహాల నివృత్తి కేంద్రాలను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ యోగా, జ్యోతిష్యం, ఆగమ, కర్మకాండ, వాస్తు శాస్త్రాలలో ప్రజలకు కలిగే సందేహాలు, సమస్యలను నివృత్తి చేసేందుకు ఈ కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి 6.30గంటల వరకు వర్సిటీలో ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డీన్‌లు విష్ణుభట్టాచార్యులు, రజనీకాంత్ శుక్లా పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నారు. అయితే వినతులు సమర్పించేందుకు విచ్చేసిన ప్రజలకు కలెక్టరేట్‌లో కనీస వసతులు సైతం కరువయ్యాయి. అర్జీలు రాసేందుకు పలువురు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా వినతులు రాసేందుకు వీఆర్‌ఓలను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. అలాగే పోలీసులు చేపట్టే ముమ్మర తనిఖీలతో కూడా కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. తనిఖీల తాకిడి తగ్గించాలని అర్జీదారులు డిమాండ్ చేస్తున్నారు. గ్రీవెన్స్‌లో సిఫార్సులకు ప్రాధాన్యమివ్వకుండా ముందుగా ఎవరు వస్తే వారికే జిల్లా అధికారులను కలిసి సమస్యలు విన్నవించుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. దీనికితోడు కలెక్టరేట్ దూరంగా ఉండడంతో తిరుపతి బస్టాండ్ నుంచి గతంలో మాదిరిగా సోమవారం నాడు ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నడపాలని కోరుతున్నారు. లేకుంటే కలెక్టరేట్‌కు వచ్చేందుకు ఆటో చార్జీ దాదాపు రూ.200 వరకు అవుతోందని వివరిస్తున్నారు.

సంస్కృతం పరిరక్షణకు కృషి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీడాక్ ఈడీ సుదర్శన్

తిరుపతి సిటీ : సంస్కృత భాషను పరిరక్షించి భావి తరాలకు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు బెంగళూరుకు చెందిన సీడాక్ ఈడీ డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్ తెలిపారు. ఆదివారం జాతీయ సంస్కృత వర్సిటీ, సీడాక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో కంప్యూటర్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. అత్యంత ప్రాచీనమైన సంస్కృత భాష జ్ఞానానికి నిధిలాంటిదని కొనియాడారు. ప్రాచీన సంస్కృత వాఙ్మయంలోని అరుదైన గ్రంథాలలోని జ్ఞానాన్ని కంప్యూటరీకరించి పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకురావాల్సి అవసరం ఉందన్నారు. అందుకోసం సంస్కృత వర్సిటీతో సీడాక్ సంస్థ ఒప్పందం చేసుకుందని వెల్లడించారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాషాభివృద్ధికి సీడాక్ సంస్థతో పలు విషయాలపై ఒప్పందం కుదరడం శుభపరిణామన్నారు. సంస్కృతంలోని విజ్ఞానం భావి భారతపౌరులకు అందించాలనే సంకల్పంతో వర్సిటీ పనిచేస్తోందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమాశ్రీ, కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.గణపతి భట్, పీఆర్‌ఓ ప్రొఫెసర్ వి.రమేష్ పాల్గొన్నారు.

● తిరుపతికి చెందిన శ్రీనివాసరావు ఆటోనగర్ సమీపంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇసుక ఉచితమని ప్రభుత్వం ప్రకటించింది కదా అని గురువారం ట్రాక్టర్ తీసుకుని పాడిపేట వద్ద స్వర్ణముఖి నదికి వెళ్లారు. అక్కడ ఇసుక తీసుకునేందుకు అనుమతి లేదని స్థానికులు చెప్పారు. దీంతో ఇసుక అనుమతి కోసం తిరుపతి, రేణిగుంట తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లారు. వెంకటగిరి లేదా నాగాలాపురం, పిచ్చాటూరు మండలాల్లోని అధికారిక రీచ్‌లకు వెళ్లాలని అధికారులు స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక శుక్రవారం ఉదయం ముందుగా వెంకటగిరి మండలం మొగళ్లగుంటలోని రీచ్‌కు కారులో చేరుకున్నారు. అక్కడ ఇసుక నిల్వ లేకపోవడంతో దొరవారిసత్రం మండలం మావిళ్లపాడులోని ఇసుక రీచ్‌కు వెళితే మళ్లీ నిరాశే ఎదురైంది. దీంతో ఉసూరుమంటూ నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చేరుకున్నా అక్కడా ఇసుక లేదు. ఇక మిగిలిన పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు రీచ్‌కు వెళితే ఇసుకైతే ఉంది కానీ.. డంప్ యార్డు వద్ద అధికారులెవ్వరూ లేరు. కాపలాగా ఓ కానిస్టేబుల్ ఉన్నారు. ఇసుక కోసం వచ్చిన సుమారు 100 టిప్పర్లు ఉదయం నుంచి వేచి ఉన్నాయి. రాత్రి వరకు ఎదురుచూసి తిరిగి తిరుపతికి వచ్చేశారు. శ్రీనివాసరావు తన కారుకి రూ.2,500 పెట్రోల్ పట్టుకుని రోజంతా సుమారు 350 కిలోమీటర్లు ప్రయాణించి తిప్పలు పడినా చివరకు ఇసుక దొరకలేదు.

● కుప్పం పట్టణానికి చెందిన మురుగప్ప అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు అప్పుచేశాడు. ఈనెల 9వ తేదీన పనులు ప్రారంభించాడు. నిర్మాణ పనుల కోసం ఇసుక తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్కారు ఏర్పాటు చేసిన రీచ్‌ల వద్దే ఇసుక కొనుగోలు చేయాలి అని అధికారులు స్పష్టం చేశారు. కుప్పానికి సమీపంలో ఇసుక తెచ్చుకునేందుకు అనుమతులు లేవని తెగేసి చెప్పారు. దీంతో సుమారు 100 కిలోమీటర్ల దూరంలోని గంగవరం మండలం నాలుగురోడ్ల కూడలి వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌కు వెళ్లాడు. తీరా అక్కడ రీచ్‌లో ఇసుక లేదు. తిరిగి వంద కిలోమీటర్లు ప్రయాణం చేసి ఉట్టి చేతులతో ఇంటికి వచ్చేశాడు. చివరకు చేసేది లేక కుప్పం సమీపంలో తయారుచేసే కృత్రిమ ఇసుకను అధిక ధరకు కొనుగోలు చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభించుకున్నాడు.

● శ్రీకాళహస్తికి చెందిన రమేష్‌బాబు స్వగృహ నిర్మాణం చేపట్టాడు. పట్టణానికి సమీపంలోని విరూపాక్షిపురం, పెన్నలపాడులో ఇసుక దొరుకుతుందని తెలుసుకుని అక్కడికి చేరుకున్నాడు. టిప్పర్ ఇసుక తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. వెంటనే అక్కడున్న టీడీపీ నేతల అనుచరులు అడ్డుకున్నారు. 'మీరంతా నదిలో యంత్రాలతో తవ్వి ఇసుక తరలిస్తున్నారు కదా.' అని రమేష్‌బాబు ప్రశ్నించడంతో కొట్టినంత పనిచేశారు. మరి ఇసుక కావాలంటే ఏం చేయాలని అడిగితే టిప్పర్ ఇసుకకు రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తాము అడిగినంత సొమ్ము ఇస్తే ఇసుకను ఇంటికే చేరుస్తామని స్పష్టం చేశారు. ఇసుక ఉచితమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు కదా అని రమేష్‌బాబు అడిగితే.. అదంతా తమకు తెలియదని, నగదు కడితేనే ఇసుక పంపుతామని తేల్చిచెప్పారు. అక్కడి నుంచి పలువురికి ఫోన్‌చేసి ఇసుక గురించి ఆరా తీసినా ఎక్కడా ఉచిత ఇసుక దొరకదని, టీడీపీ వాళ్లే విక్రయిస్తున్నారని తెలియడంతో చేసేదిలేక రమేష్‌బాబు రూ.25వేలు చెల్లించి టిప్పర్ ఇసుక కొనుగోలు చేసుకున్నాడు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



యథేచ్ఛగా ట్రాక్టర్లతో ఇసుక తరలింపు



శ్రీకాళహస్తి సమీపంలోని స్వర్ణముఖి నదిలో యంత్రాలతో అక్రమంగా ఇసుకను తవ్వి వాహనాలకు నింపుతున్న దృశ్యం

ఉచితం కాదు.. అనుచితం



"మీ ఊరి దగ్గర వాగు ఉందా..? కాలువ ఉందా..? నది ఉందా..? అక్కడకు వెళ్లి తట్టలతో తెచ్చుకుంటారో.. ఎద్దుల బండిలో తెచ్చుకుంటారో.. కావాల్సినంత ఇసుకను ఉచితంగా తీసుకెళ్లండి.. ఎవరు వద్దంటారు..? పైసా చెల్లించాల్సిన అవసరం కూడా లేదు." అని చాలా తేలిగ్గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించేశారు. అంతలోనే బండిలో ఇసుక తరలించడం నిషేధం అంటూ ప్లేటు మార్చేశారు. ఎప్పటికప్పుడు ఉచిత ఇసుక అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు. దిగితే కానీ లోతు తెలియదు అన్నట్టు.. ఇసుక కోసం వెళ్లిన వారికే లోగుట్టు తెలుస్తోంది. ఉచితం పేరిట టీడీపీ నేతల అనుచిత వైఖరి అర్థమవుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌లలో మాత్రం ఇసుక రేణువు కూడా ఉండదు. అదే పచ్చ మూక అనధికారికంగా పాగా వేసిన పాయింట్లలో మాత్రం కావాల్సినంత ఉంటుంది. అక్కడ వాళ్లు చెప్పిందే రేటు.. అడిగినంత చెల్లిస్తేనే పనవుతుంది. ఉచిత ఇసుక అంటూ ఊదరగొడుతూ జనం చెవిలో పువ్వులు పెడుతున్న కూటమి సర్కారు నాటకాలపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

ఇసుక పేరుతో పచ్చ మోసం

- అధికారిక ఇసుక రీచ్‌లు ఏడింటికి గాను మూడింటిలో నిల్వలు నిల్
- అక్కడ కూడా వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లు
- అనధికార పాయింట్లు ఏర్పాటు చేసుకుని టీడీపీ నేతల దందా
- నదులు.. ప్రైవేట్.. సర్కారు భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- భారీ ధరలకు విక్రయిస్తూ జనం నడ్డివిరగ్గొడుతున్న తెలుగు తమ్ముళ్లు
- పొరుగు రాష్ట్రాలకు సైతం అక్రమంగా తరలింపు
- అధికారులతో కుమ్మక్కై యథేచ్ఛగా దోపిడీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ప్రభుత్వం ఏడు ఇసుక రీచ్‌లను అధికారికంగా ఏర్పాటు చేసింది. అయితే వాటిలో కేవలం మూడు రీచ్‌లలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. తిరుపతి జిల్లా పిచ్చాటూరు అడవికోయంబేడు, చిత్తూరు జిల్లా గంగవరం మండలం నాలుగురోడ్ల కూడలి, చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లె, పాలూరులో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. మిగిలిన నాలుగు రీచ్‌లలో ఇసుక డంప్‌లు లేవు. ప్రభుత్వం ఉచితమంటూ ప్రకటించిన రెండు రోజులు మాత్రమే ఇక్కడ ఇసుక డంప్‌చేశారు. తర్వాత ఖాళీ అయిన రీచ్‌లలో ఇసుకను మళ్లీ డంప్ చేయలేదు.

వెలుగులోకి మరో మోసం

ఇసుక ఉన్న రీచ్‌ల వద్ద అధికారులు, టీడీపీ నేతలు లాలూచీ పడి ఎవరికీ అనుమానం రాకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. 10 టన్నులకు చలానా కట్టి టిప్పర్‌లో 15 టన్నులు ఇసుక నింపి సొమ్ముచేసుకుంటున్నారు. అలాగే 4 టన్నులకు రశీదు వేసి ట్రాక్టర్‌లో 5 టన్నుల ఇసుకను తరలించి జేబులు నింపుకుంటున్నారు.

అడిగినంత చెల్లిస్తేనే..

ప్రస్తుతం మూడు రీచ్‌లలో ఉన్న ఇసుక కోసం వెళ్లిన వినియోగ దారులకు నిర్వాహకుల నుంచి చేదు అనుభవం ఎదురవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం టన్ను ఇసుక రూ.155 లెక్కన ట్రాక్టర్ (ఐదు టన్నులు)రూ.775 అవుతుంది. బాడుగ 0–10 కిలోమీటర్ల అయితే రూ.1,200. అదే టిప్పర్ ఇసుక అయితే రూ.1,550. దూరం పెరిగే కొద్దీ వాహనం బాడుగ పెరుగుతుంది. ఇదిలా ఉంచితే.. టీడీపీ నేతలు ఒక వాహనానికి అదనంగా రూ.3వేలు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని అధికారులతో కలిసి వాటాలు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. పిచ్చాటూరు మండలం అడవికోయంబేడులో అదనపు వసూళ్లకు పాల్పడడంతో వినియోగదారులు నిలదీశారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలోనే అధికారులు శుక్రవారం ఇసుకను విక్రయాలు నిలిపివేసినట్లు సమాచారం. ఫలితంగా వందలాది వాహనాలు రోజంతా వేచి ఉండాల్సి వచ్చింది.

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఇసుక రీచ్‌లు

మండలం	ప్రాంతం
వెంకటగిరి	మొగళ్లపాడు
దొరవారిసత్రం	మావిళ్లపాడు
నాగలాపురం	సుబ్బానాయుడుకండ్రిగ
పిచ్చాటూరు	అడవికోయంబేడు
చిత్తూరు రూరల్	దిగువమాసాపల్లె, పాలూరు
గంగవరం	నాలుగురోడ్ల కూడలి

రెండు వారాలుగా నిల్వలు లేనివి

వెంకటగిరి	మొగళ్లపాడు
దొరవారిసత్రం	మావిళ్లపాడు
నాగలాపురం	సుబ్బానాయుడు కండ్రిగ
గంగవరం	నాలుగురోడ్ల కూడలి



నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ రీచ్‌లో ఇసుక లేని దృశ్యం



దొరవారి సత్రం మండలం మావిళ్లపాడు వద్ద ఇసుక నిల్వ లేని అధికారిక రీచ్

ఊరూరా అక్రమ రీచ్‌లు!



పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు రీచ్‌లో ఇసుక నింపకపోవడంతో బారులు తీరిన వాహనాలు



పాడిపేట వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలకు వచ్చిన టీడీపీ వారిని అడ్డుకున్న స్థానికులు(ఫైల్)

ప్రభుత్వ రీచ్‌లలో ఇసుక లేకుండా చేసి.. కూటమి నేతలు సొంతంగా ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు. చంద్రగిరి నుంచి నాయుడుపేట వరకు స్వర్ణముఖి నదీ తీరంలో టీడీపీ నేతల అనధికారికంగా రీచ్‌లే కనిపిస్తున్నాయి. భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. కంటైనర్ల ద్వారా చెన్నై, బెంగుళూరుకు తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. మరోవైపు రైతులను బెదిరించి వారి భూముల్లోని ఇసుకను సైతం తవ్వేసి విక్రయించేస్తున్నారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజక వర్గాల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టారు. రెండు రోజుల క్రితం తిరుపతి రూరల్ మండలం పాడిపేట వద్ద, ఏర్పేడు మండలం పెనుమల్లం వద్ద వెలుగుచూసిన టీడీపీ నేతల బాగోతమే ఇందుకు నిదర్శనం. డీకేటీ పట్టాలు పొందిన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో టీడీపీ నేతలు దౌర్జన్యంగా భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి వందలాది వాహనాల ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. అదే విధంగా శ్రీకాళహస్తి మండల పరిధిలోనూ ఇదే తరహాలో అక్రమాలు జరుగుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుంచి రూ.7వేలకు విక్రయించి డబ్బులు పోగేసుకుంటున్నారు. టిప్పర్ అయితే రూ.25వేల నుంచి రూ.36వేలకు విక్రయించేస్తున్నారు. చెన్నై, బెంగుళూరు లాంటి ప్రాంతాలకు అయితే లోడ్ ఇసుక రూ.లక్షపైనే ఉంటుందని అంచనా.

తమ్ముళ్లవైతే కేసే లేదు!

టీడీపీకి చెందిన వారు ఎక్కడైనా ఇసుకను తవ్వి తరలించుకెళ్లినా అధికారులు పట్టించుకోరు. ఇంకొకరు చలానా కట్టి ఇసుక తీసుకెళుతున్నా కేసులు తప్పవు. శ్రీకాళహస్తి పరిధిలో ఓ వ్యక్తి రూ.1,200 చెల్లించి ట్రాక్టర్ ఇసుక తీసుకెళుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పైసా కట్టకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ పట్టుబడ్డారు. ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత ఒకరు పోలీసులకు ఫోన్ చేయటంతో తెలుగు తమ్ముళ్లను మాత్రం రాచమర్యాదలు చేసి విడిచిపెట్టేశారు. ప్రభుత్వానికి నగదు చెల్లించి ఇసుక తరలించిన వ్యక్తిపై మాత్రం కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేయడం గమనార్హం.



ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లు



తట్టలతో ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు

రాచ'మార్గం'లో..

అక్రమార్జన కోసం టీడీపీ నేతల కుయుక్తులు అన్నీ ఇన్నీ కావు. ఇసుక తవ్వకాల కోసం ఏకంగా స్వర్ణముఖి నదిలోకి పలు ప్రాంతాల్లో రహదారులు ఏర్పాటు చేసేశారు. నేరుగా నది మధ్యలోకే వెళ్లేలా దారులు వేసేశారు. ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు సులువుగా సజావుగా బయటకు వచ్చేలా ఆయా మార్గాలను రూపొందించారు. ఈ క్రమంలోనే యంత్రాలు అందుబాటులోని చోట్ల ఇసుక లోడ్ చేసేందుకు కూలీలను వినియోగిస్తున్నారు. ఒక్కో వాహనానికి ఇంత అని కూలి చెల్లించి.. అది కూడా ఇసుక కొనుగోలు చేసేవారిపైనే భారం మోపుతున్నారు. ఏది ఏమైనా కాసులు మూటగట్టుకోవడమే లక్ష్యంగా నదీమతల్లికి గర్భశోకం కలిగిస్తున్నారు.



స్వర్ణముఖి నదిలోకి వేసిన దారి

నిమ్మ అధరహో..!

ప్రస్తుతం మార్కెట్‌లో నిమ్మ హవా నడుస్తోంది. అనూహ్యంగా రేటు పలుకుతుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వేసవిని మించి వర్షాకాలం ఈ స్థాయి ధర గిట్టుబాటు కావడంపై ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ క్రమంలో నాణ్యమైన పంటను అందిపుచ్చుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాయలపై ఎలాంటి మచ్చలు పడకుండా చర్యలు చేపడుతున్నారు. బయటి ప్రాంతాల నుంచి నిమ్మకాయలు రాకపోవడంతో ఇక్కడి మార్కెట్లలో రేటు ఆశాజనకంగా ఉందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

- రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్
- రూ.9వేలు పలుకుతున్న బస్తా కాయలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతు, కూలీ



నిమ్మకాయలు



సస్యరక్షణ చర్యల్లో మహిళా రైతు

సైదాపురం : గూడూరు, వెంటగిరి మార్కెట్‌లలో నిమ్మకాయలు మంచి ధర పలుకుతున్నాయ్. రెండు రోజులుగా నుంచి అంచనాలకు మించి రేట్లు వస్తున్నాయి. ప్రస్తుతం లూజు బస్తా రూ.7వేల నుంచి రూ.9 వేల వరకు గిట్టుబాటవుతోందని నిమ్మ వ్యాపారులు చెబుతున్నారు. ఈలెక్కన కిలోల వంతున చూసుకుంటే రూ.80 నుంచి రూ.110 వరకు అమ్ముడవుతున్నట్లు వెల్లడిస్తున్నారు.. బయట ప్రాంతాల నుంచి నిమ్మకాయలు రాకపోవడమే ధరల పెరుగుదలకు కారణంగా వివరిస్తున్నారు.

ఊహించని విధంగా..

ఢిల్లీ మార్కెట్‌లో సైతం నిమ్మకాయల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. రాబోయే రోజుల్లో కూడా మరింతగా నిమ్మకాయల రేటు పెరిగే అవకాశముందని రైతులు భావిస్తున్నారు. అయితే ఈ సీజన్‌లో నిమ్మ దిగుబడులు తక్కువగానే ఉన్నాయి. అయినప్పటికీ మంచి ధర ఉండడంతో లాభాల పంట పండుతుందని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా ఆగస్టులో ఊహించని విధంగా నిమ్మకు గిరాకీ వచ్చిందని వెల్లడిస్తున్నారు. నాణ్యంగా ఉంటే పచ్చి కాయలకు మరింత రేటు దక్కుతోందని చెబుతున్నారు. ఈ క్రమంలో రైతులు సైతం చెట్లకు ఉన్న కాయల నాణ్యతను కాపాడుకునేందుకు మరింత జాగ్రత్తగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

'వాలు కుర్చీలో తలపోతలు' పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంగమ్మ తదితరులు

తిరుపతి(కల్చరల్): స్విమ్స్ పూర్వ వీసీ ఆచార్య కూపాటి వెంకటరెడ్డి (92) రాసిన 'వాలు కుర్చీలో తలపోతలు' పుస్తకాన్ని ఆదివారం ఎస్వీ నగర్‌లోని ఆయన ఇంట్లో స్విమ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యారంగానికి ఈ పుస్తకం దారి దీపమన్నారు. పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ పుస్తకాన్ని సమీక్షిస్తూ ఉద్యోగ విరమణ అనంతరం పాతిక పుస్తకాలు రాసిన వెంకటరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంసీ రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ అప్పస్వామిపిళ్ళై, కేవీ చలపతి పాల్గొన్నారు.

తిరుమల డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ శేఖర్

తిరుమల: తిరుమల డీఎస్పీగా విజయ శేఖర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కృషి చేస్తానన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. తాను గతంలో తిరుమల సీఐగా పనిచేశానని, తిరిగి ఇదే ప్రాంతానికి డీఎస్పీగా రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని ఆశ పెట్టారు. దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలు విడుదల చేస్తున్నారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో నిరుద్యోగ యువత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమతో ఆడుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

డీఎస్సీ శిక్షణ.. డోలాయమానం!



- ముందుగా జూలైలో ప్రకటన విడుదల చేసిన అధికారులు
- ఆగస్టు 1 నుంచి ఉచిత ట్రైనింగ్ అంటూ దరఖాస్తుల ఆహ్వానం
- తర్వాత అతీగతీ లేని శిక్షణ
- మళ్లీ ఇప్పుడు మరోసారి దరఖాస్తులు పిలవడంతో అభ్యర్థుల అయోమయం

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చంద్రబాబు ఊదరగొట్టారు. నిరుద్యోగుల ఓట్లు దండుకున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే సమయంలో డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు ఫైల్‌పై సంతకం చేశారు. అంతా బాగానే ఉంది కానీ, తర్వాత టెట్ నిర్వహణ, డీఎస్సీ ఏర్పాట్లు పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే డీఎస్సీ రాయనున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ అంటూ ప్రటనలు గుప్పించారు. అయితే ఆచరణలోకి మాత్రం తీసుకురావడం లేదు. డీఎస్సీ ఉచిత శిక్షణ డోలామయంలో పడిందంటూ నిరుద్యోగులు మండిపడుతున్నారు.

మీనమేషాలు లెక్కిస్తూ..

డీఎస్సీ పరీక్షలకు తిరుపతిలోని ఎమ్మార్‌పల్లె సర్కిల్ వద్ద ఉచితంగా శిక్షణ ఇస్తామంటూ జూలై 3వ తేదీ నుంచి 10వ తేది వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అప్పటి జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. టీటీసీ చేసిన వారికి అవకాశం లేదని స్పష్టం చేశారు. బీఈడీలోనూ రెండు జిల్లాలకు సంబంధించి కేవలం 200 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆ మేరకు బీఈడీలో అధిక మార్కులు వచ్చిన వారిలో 200 మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆగస్టు 1వ తేది నుంచి శిక్షణ ఉంటుందని ఆ విభాగం అధికారులు తెలిపారు.ఆమేరకు 300 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఆ దరఖాస్తులను పట్టించుకోలేదు. ఆగస్టు 1 నుంచి శిక్షణ ప్రారంభం కాలేదు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీకి చెందిన డీఎస్సీ విద్యార్థులు 30 వేల మంది ఉన్నారు. వచ్చిన 300 దరఖాస్తులను ఇప్పటి వరకు పట్టించుకోలేదు.

మళ్లీ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి,చిత్తూరు,కడప, అన్నమయ్య జిల్లాల్లోని ఎస్సీ విద్యార్థులకు తిరుపతి నగరంలో డీఎస్సీలో ఉచిత శిక్షణ ఇస్తామని దరఖాస్తులు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఇవ్వాలంటూ జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి సూర్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నాలుగు జిల్లాల నుంచి కేవలం 100 మందికి మాత్రమే ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తుల్లో డిగ్రీ, బీఏడ్, టీటీసీ, టెట్ మార్కుల్లో మెరిట్ ప్రకారం 100 మందిని మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. అదనపు సమాచారం కోసం సీనియర్ అసిస్టెంట్ పి.శీనయ్యను 9493524121 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విజయవాడ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. అయితే ఈ నాలుగు జిల్లాల్లో 10వేల మంది ఎస్సీలు డీఎస్సీకి సిద్ధం అవుతున్నారు. అందులో కేవలం వంద మందికి మాత్రమే అవకాశం కల్పిస్తామని చెప్పడాన్ని అంతా తప్పుపడుతున్నారు.

ఆవేదనలో భాషోపాధ్యాయులు



మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలతో భాషోపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని టీపీపీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా శాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డీఈఓ పూల్‌లో సుమారు వెయ్యి మంది భాషా పండితున్నారని, వెంటనే వీరికి ఉద్యోగోతులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భాషా పండిత వ్యవస్థ రద్దు అయినప్పటికీ మిగులు భాషా పండితులు ఇతర క్యాడర్ పోస్టుల్లో పనిచేస్తూ వేతనం పొందుతున్నారని చెప్పారు. ఎప్పుడు బదిలీలు నిర్వహించినా వారికి స్థానం చలనం వస్తుండడంతో మానసిక వేదనకు లోనవుతున్నారని వివరించారు. జీఓ 117 ప్రకారం కాకుండా జీఓ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, అలాగే స్టాఫ్ ప్యాటర్న్ అనుసరించి విద్యార్థుల సంఖ్య 241దాటితే తెలుగు సబ్జెక్టులానే హిందీకి సైతం రెండో పోస్టును కేటాయించాలని కోరారు. 9, 10వ తరగతులకు సంబంధించి హిందీ సబ్జెక్టులో సిలబస్ చాలా కఠినంగా ఉందని, మార్పులు చేసి పాఠ్యాంశాల నిడివి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాష్, గౌరవ సలహాదారు సి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు సహదేవుడు, నాయకులు శ్రీరాములు, పట్టాభిరామయ్య, టి.శ్రీనివాసులు, డి.రామచంద్రయ్య, బి.గణపతి, గంగులయ్య, సుందరయ్య, ఎల్.వెంకటరమణపాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు అవమానం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నూకతోటి రాజేష్ తదితరులు

సత్యవేడు : రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను టీడీపీ నేతలు దారుణంగా అవమానించారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ మండిపడ్డారు. ఆదివారం ఈ మేరకు సత్యవేడులోని అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాల వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. రాజేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా జగనన్న ఏర్పాటు చేసిన అతి పెద్ద విగ్ర హం శిలాఫలకాన్ని టీడీపీ మూకలు ధ్వంసం చేయడం క్షమించరాని నేరమన్నారు. ఈ దురాగతానికి పాల్పడిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుశీల్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వేలూరు రాకేష్, ఏపీఎం బాలాజీ రెడ్డి, అపరంజిరాజు, రమేష్, వినోద్, వేణు, ఎంపీ రవి, గోవిందస్వామి, రవిరెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, శరవనన్, పునీదకుమార్, మునివేలు, శోభన్, చలపతిరాజు, సుబ్రమణ్యంరెడ్డి, మోహన్, ఎంఎస్ శ్యామ్, చలపతిరాజు, పళణి, జోసెఫ్, టెంకాయల కృష్ణయ్య, సురేష్, రాబర్టు, రూబెన్, టి.జయ పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న జస్టిస్ సీతారామమూర్తి

తిరుపతి లీగల్: యువ న్యాయవాదులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అందుకోగలరని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రస్తుత తెలంగాణ హైకోర్టు జ్యుడీషియల్ అకాడమీ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఎస్ఎల్ జ్యుడీషియల్ అకాడమీలో జిల్లా జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు పోటీపడే అభ్యర్థులకు క్లాసులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ సీతారామమూర్తి మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటిసారిగా తిరుపతిలో ఓ ప్రైవేట్ జ్యుడీషియల్ అకాడమీని ప్రారంభించి పోటీపడే అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. అకాడమీలో రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయ నిపుణులతో క్లాసులు నిర్వహించడం చక్కటి నిర్ణయమని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యుడు రఘురామన్, జ్యుడిషల్ అకాడమీ సంస్థ డైరెక్టర్ యండమూరి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

నాయుడుపేట టౌన్(తిరుపతి జిల్లా): పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం మర్లపల్లె గ్రామంలో ఆమె విలేకర్లతో మాట్లాడింది. బాధితురాలి కథనం మేరకు.. ఈవీ నరసమ్మకు వివాహమై 2007లో భర్తతో విడిపోయి విడాకులు తీసుకుంది. మళ్లీ పెళ్లి చేసుకునేందుకు తెలుగు మ్యాట్రిమోనీలో ప్రకటన చేసింది. ఈ క్రమంలో తిరుపతికి చెందిన చుండ్రు నవీన్ చౌదరి ఈ ప్రకటనలోని సెల్ నంబర్ ద్వారా నరసమ్మకు ఫోన్ చేశాడు. క్రమేణా పరిచయం పెంచుకున్నాడు. అతనికి కూడా గతంలో వివాహం జరిగి భార్యతో విడాకులు తీసుకుని ఉన్నాడు. ఈ విషయం చెప్పి నరసమ్మను పెళ్లి చేసకుంటానని నమ్మించాడు. తిరుపతిలోని తన ఇంటికి ఆమెను తీసుకెళ్లి సహజీవనం చేశాడు. తీరా ఆమె గర్భవతి కావడంతో వదిలించుకునేందుకు యత్నించాడు. మరో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు బాధిత మహిళ వాపోయింది. అంతే కాకుండా ఈనెల 6వ తేదీ నాయుడుపేటకు వచ్చి తనకు బలవంతంగా అబార్షన్ చేయించేందుకు తెగించాడని ఆరోపించింది. ఆ సమయంలో పోలీసులు పట్టుకున్నారని, పూచీకత్తు తీసుకుని విడిచిపెట్టారని వెల్లడించింది. పోలీసులు తగు చర్యలు తీసుకుని తనకు నవీన్ చౌదరితో వివాహం జరిపించి న్యాయం చేయాలని కోరింది. దీనిపై ఎస్‌ఐ గోపీని వివరణ కోరగా.. బాధితురాలి ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. తిరుపతి నుంచి సదరు వ్యక్తిని పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని, వినకపోతే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నాటు బాంబులు పట్టివేత

– ఇద్దరి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు బాంబులు

పాకాల : నాటు బాంబులతో సంచరిస్తున్న ఇద్దరిని ఆదివారం పోలీసుల అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 26 బాంబులను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. పాకాల–చిత్తూరు రోడ్డు మార్గంలోని మణిపిరెడ్డిపల్లెకు సమీపంలో రైల్వే గేటు పక్కన కె.బాబు, గజేంద్ర అనే వ్యక్తులు నివాసం ఉంటున్నారు. పందులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు ఇంటి వద్దనే బాంబులు తయారు చేసి సమీపంలో ఉన్న గుట్ట, పొలాల్లో వీటిని ఉపయోగించి అడవి పందులను చంపేవారు. ఈ మేరకు పోలీసు విచారణలో నిందితులు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన మస్తాన్

తడ : సూళ్లూరుపేట సమీపంలోని కొండూరు పంచాయతీ పులివేంద్ర గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని బీవీపాళెం గ్రామానికి చెందిన టి.మస్తాన్ పెరియవట్టు కుప్పానికి చెందిన తన మిత్రుడు ఎం.షాదిక్‌తో కలసి ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేటకు బయలు దేరాడు. మార్గం మధ్యలో పులివేంద్ర వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. వెనుక మరో బైక్‌పై వస్తున్న స్నేహితులు గమనించి 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మస్తాన్ అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన షాదిక్‌ను కుటుంబీకులు చెన్నై స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహారావు తెలిపారు.

సంస్కృత వారోత్సవాలకు శ్రీకారం

తిరుపతి సిటీ : తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగనున్న సంస్కృత వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం చెలికాని అన్నారావు భవన్‌లో వీసీ కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రావణమాసంలో వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. బెంగుళూరు సంస్కృత వర్సిటీ వీసీ అహల్య, సీడాక్ ఈడీ డాక్టర్ సుదర్శన్, రిజిస్ట్రార్ రజని, డీన్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉదయాన హెగ్డే పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో కొండచిలువ



కొండ చిలువ కళేబరం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగో గేటు వద్ద ఆదివారం మధ్యాహ్నం 8 అడుగుల కొండచిలువ కలకలం రేపింది. భక్తుల మధ్యకు ఒక్కసారిగా రావడంతో భయాందోళనకు గురయ్యారు. చివరకు కొండచిలువను అక్కడే కొట్టి చంపేశారు.

ఘాట్ రోడ్డులో చిరుత కలకలం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతి వచ్చే ఘాట్ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి చిరుత కలకలం రేపింది. 55, 56 మలుపుల వద్ద రోడ్డు దాటుతూ వాహనదారులకు కనిపించింది. ఆపై చెట్ల పొదల్లోకి వెళ్లడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

రెండు బైక్‌ల ఢీ : ఒకరి మృతి



నరసింహరాజు మృతదేహం

రాపూరు : మండలంలోని పెనుబర్తి సమీపంలో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న మోటారు సైకిళ్లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన రాచూరు నరసింహారాజు(35) తన కుమారుడు రిషితో కలిసి బైక్‌పై కలువాయి మండలం పెన్నబద్దేలుకు బైక్‌పై బయలుదేరాడు. రాపూరు మండలం గోనుపల్లెకు చెందిన దిలీప్, సునీల్ మోటారుసైకిల్‌లో రాపూరుకు వస్తున్నారు. ఓబులాయిపల్లె వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నరసింహారాజు, రిషి గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరసింహారాజు మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాల్యాద్రి తెలిపారు.

మేధో వలస నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ టీఎం నగేష్, హాజరైన ప్రజలు

తిరుపతి సిటీ: దేశం నుంచి మేధో వలస నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని తిరుపతి పద్మావతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ టీఎం నగేష్ తెలిపారు. స్థానిక జాతీయ సంస్కృత వర్సిటీలో ఆదివారం ఏపీ సమాలోచన మేధావుల వేదిక ఆధ్వర్యంలో రోల్ ఆఫ్ ఇంటలెక్చువల్స్ ఇన్ షేపింగ్ వికసిత్ భారత్ అనే అంశంపై చర్చ చేపట్టారు. ఇందులో డాక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మేధాశక్తి వలస వెళ్లడంతో దేశాభివృద్ధికి నష్టం ఏర్పడుతోందన్నారు. యువతతో పాటు పలు రంగాల్లో నిపుణులైన మానవ సంపద ఇతర దేశాల ఆర్థికాభివృద్ధికి సహకరించడం సమంజసం కాదన్నారు. భారతదేశంలో మేధావి వర్గానికి కొదవలేదని, అది ఎగుమతి కాకుండా నివారించాల్సిన బాధ్యత సమాజంతో పాటు ప్రభుత్వాలకు ఉందన్నారు. దేశంలోని వనరులను సక్రమమైన రీతిలో వినియోగంచుకుంటే దేశాభివృద్ధితో పాటు ప్రభుత్వం తలంచిన వికసిత్ భారత్ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. భారతదేశానికి ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇతర దేశాల నుంచి వస్తువులను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో తయారు చేసిన వస్తువుల ఎగుమతికంటే దిగుమతి ఎక్కువగా ఉండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, డాక్టర్ లక్ష్మీప్రియ, కన్వీనర్ సోమశేఖర్, నరేంద్ర, బాలాజీ, విశ్వనాథ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీ జీహెచ్ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 79,313 మంది స్వామిని దర్శించుకోగా 39,344 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.65 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని పేర్కొంది.

'పచ్చ' గద్దలపై తిరుగుబాటు

- కబ్జాలను అడ్డుకున్న పేరూరువాసులు
- టీడీపీ నేతలను నిలదీసిన మహిళలు
- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు



టీడీపీ నేతలను నిలదీస్తున్న పేరూరు వాసులు

తిరుపతి రూరల్ : 'మీ బాబు గాడి సొత్తులాగా కాలువను కబ్జా చేస్తున్నారు. రౌడీ షీటర్లను వెంటేసుకుని కత్తులతో బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కాలువను ఆక్రమించి పట్టపగలే షెడ్లు నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఏమిటి ఈ బరితెగింపు. పది రోజులుగా కబ్జాలు జరుగుతున్నా, కనీసం ఎమ్మెల్యే కూడా స్పందించకపోవడం దారుణం. అధికారం ఇచ్చింది కబ్జాలు చేయడానికేనా...ఇలా అయితే మీకు బుద్ధి చెప్పడం ఖాయం' అంటూ పేరూరు వాసులు టీడీపీ నేతలపై తిరుగుబాటు చేశారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో సర్వే నంబర్ 460లో కాలువను ఆక్రమించి టీడీపీ నేతలు అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నారు. పోలీస్ రికార్డుల్లో రౌడీషీటర్లుగా ఉన్న వారిని పక్కన పెట్టుకుని మరీ పోలీస్, రెవెన్యూ, పంచాయతీ అధికారులను బెదిరిస్తున్నారు. కాలువ కబ్జాలపై ఆదివారం పేరూరు వాసులు తిరుపతి రూరల్ జెడ్పీటీసీ సభ్యులు రత్నమ్మ, సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌తో కలిసి ఈ కబ్జాలను అడ్డుకున్నారు. అక్కడ ఉన్న టీడీపీ నేతలు నాగరాజు, శశి, జ్ఞానేశ్వర్, చిన్ని, మహేష్, చంద్రను నిలదీశారు. 'చిన్నపిల్లాడి చేతిలో ఓడిపోతే పరువు ఉండదు.. మీరు ఓటు వేయకపోతే చనిపోవడమే దిక్కు' అంటూ ఇంటి ఇంటికి వచ్చి ఓట్లు వేయించుకుంది కబ్జాలు చేయడానికా..అంటూ స్థానిక మహిళలు మండిపడ్డారు. 30 ఏళ్లుగా నివాసముంటున్న ప్రాంతానికి రోడ్డు సదుపాయం కల్పించాలని అడిగితే పట్టించుకోకుండా, కాలువలు, చెరువులను కబ్జా చేయడంలో మునిగిపోతున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజులుగా దీనిపై గొడవ చేస్తున్నా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం చూస్తుంటే..ఆయనకు తెలిసే ఈ కబ్జాలు జరుగుతున్నాయమో అని అనుమానం వ్యక్తం చేశారు. మహిళలు, గ్రామస్తుల తిరుగుబాటుతో టీడీపీ నేతలు తోకముడిచారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణలు తొలగించాలి

ఎమ్మెల్యే నాని పేరు చెప్పుకుని గ్రామానికి చెందిన టీడీపీ నేతలు కాలువను కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్లు నిర్మించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చినా కబ్జాలు కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడం దారుణం. ఇప్పటికైనా టీడీపీ నేతల కబ్జాలు అడ్డుకోవాలి. ఆక్రమణలు తొలగించాలి.

– దామినేటి కేశవులు, సర్పంచ్, పేరూరు